క్లుప్తంగా

ఎమ్మెల్యే గోపినాథ్ మృతి పార్టీకి తీరని లోటు

దేవరకొండ: జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపినాథ్ మృతి బీఆర్ఎస్ పార్టీకి తీరని లోటని బీఆర్ఎస్ నల్లగొండ జిల్లా అధ్యక్షుడు, దేవరకొండ మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్ర కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మూడు పర్యాయాలు ఎమ్మెల్యేగా గెలుపొందిన ఆయన నిరంతరం ప్రజల మధ్య ఉంటూ సమస్యల పరిష్కారానికి ఎంతగానో కృషి చేశారని పేర్కొన్నారు. రాజకీయాల్లో అంచలంచెలుగా ఎదిగిన గోపినాథ్ ఎంతో సౌమ్యుడిగా ప్రజానేతగా పేరు సంపాదించారని గుర్తుచేశారు. రాష్ట్ర రాజకీయాల్లో తనదైన ముద్ర వేసుకున్నారని కొనియాడారు. ఆయన మృతి పట్ల వారి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

దుర్గాదేవి ఆలయంలో ఎమ్మెల్సీ పూజలు



ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్సీ

గుర్రంపోడు : మండలంలోని తేనెపల్లి గ్రామంలో ఆదివారం దుర్గాదేవి కల్యాణ మహోత్సవం, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన కార్యక్రమాల్లో ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు గోపిడి లక్ష్మీనర్సింహారెడ్డి, గట్టుపల్లి శ్రీనాథ్ రెడ్డి, గట్టుపల్లి శ్రీకాంత్ రెడ్డి, వడిత్యా నాగరాజు, సైదిరెడ్డి, మునుకుంట్ల రాజేష్ రెడ్డి తదితరులున్నారు.

గడ్డం రూపాన్సీకి సన్మానం



రూపాన్సీ దంపతులను సన్మానిస్తున్న నాయకులు

దేవరకొండ: దేవరకొండకు చెందిన గడ్డం రూపాన్సీ ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ సతీష్ పర్యవేక్షణలో ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ విభాగంలో లీథియం అయాన్‌పై చేసిన పరిశోధనలకు గాను ఇటీవల డాక్టరేట్ అందుకున్నారు. ఆదివారం బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో దేవరకొండ పట్టణంలోని గ్రంథాలయంలో ఆమెను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి చింతపల్లి శ్రీనివాస్‌గౌడ్, రిటైర్డ్ వీసీ రామ చంద్రం, పంగునూరి లింగయ్య, పగిడిమర్రి సత్యమూర్తి, రంజాన్‌బేగ్, పున్న వెంకటేష్, చంద్రమౌళి, బాబా, శ్రీనివాస్ తదితరులున్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

దేవరకొండ: దేవరకొండ మండలం కొమ్మేపల్లి గిరిజన సంక్షేమ గురుకుల కళాశాలలో 2025–26 విద్యాసంవత్సరానికి సంబంధించి ఖాళీగా ఉన్న ఎంపీసీ, బైపీసీ మొదటి సంవత్సరానికి ఎస్టీ విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ హనుమాన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు మెమో, టీసీ, స్టడీ కండక్ట్, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, నాలుగు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలతో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. వివరాలకు 83339 25375 నంబర్లను సంప్రదించాలని కోరారు.

'లంబాడా సామాజిక వర్గానికి తీరని అన్యాయం'

చింతపల్లి: దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్‌కు మంత్రివర్గంలో చోటు కల్పించకపోవడం లంబాడా సామాజిక వర్గానికి తీరని అన్యాయమని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి ముచ్చర్ల యాదగిరి ఆదివారం తెలిపారు. బాలునాయక్ ఎన్నో సంవత్సరాలుగా కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. కొన్ని సామాజిక వర్గాలకు గతంలోనే మంత్రులుగా ఉన్న వర్గాలకే ప్రాతినిధ్యం కల్పించడం తప్పని తెలిపారు. ముస్లిం సామాజిక వర్గాన్ని విస్మరించడం కూడా అన్యాయమని, కనీసం భవిష్యత్‌లో విస్తరించే అవకాశం ఉన్నందున ఈ రెండు సామాజిక వర్గాలకు పెద్దపీట వేయాలని కోరారు.

దేశ రక్షణకు పాటుపడాలి



సామ్రాజ్య దినోత్సవంలో పాల్గొన్న శివాజీ హిందూ ఉత్సవ సమితి నాయకులు

మిర్యాలగూడ టౌన్ : పట్టణంలోని ఈదులగూడెంలో ఆదివారం శివాజీ హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో హిందూ సామ్రాజ్య దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా శివాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉత్సవ సమితి నాయకులు మాట్లాడుతూ.. శివాజీని స్ఫూర్తిగా తీసుకొని ప్రతి ఒక్కరూ దేశం కోసం, ధర్మం కోసం పాటుపడాలన్నారు. కార్యక్రమంలో మామిడి సత్యనారాయణ, బంటు గిరి, కొంగరి వెంకటరమణ, చిల్లంచర్ల అభి, ఆనంద్, క్రాంతికుమార్, వంశీ, శ్రీకాంత్, చరణ్, తేజ, అనిల్, నాగరాజు, కిరణ్, భరత్, రాజు తదితరులు పాల్గొన్నారు.

వృథాగా ఈ- పంచాయతీ భవనాలు

- కంప్యూటర్ ఆపరేటర్లు లేకపోవడంతో తెరుచుకోని భవనాలు
- వినియోగంలోకి తీసుకురావాలని వేడుకోలు



పెండ్లిపాకలలో వృథాగా ఉన్న ఈ- పంచాయతీ కార్యాలయ భవనం



గుమ్మడవెల్లిలో..

కొండమల్లేపల్లి : గ్రామీణ ప్రాంతాలను డిజిటలైజేషన్ (కంప్యూటరీకరణ) చేయాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం 2021లో శ్యాం ప్రసాద్ ముఖర్జీ మూడవ విడత రూర్బన్ నిధుల కింద కొండమల్లేపల్లి మండల పరిధిలోని పెండ్లిపాకల, గుమ్మడవెల్లి గ్రామాల్లో ఈ- పంచాయతీ కార్యాలయ భవనాలను నిర్మించారు. నాలుగైదు గ్రామాలను కలిపి ఒక క్లస్టర్‌గా ఏర్పాటు చేసి ఈ- పంచాయతీ కార్యాలయాల ద్వారా పరిపాలన నిర్వహించాలనే ఉద్దేశంతో సుమారు రూ. 8లక్షల వ్యయంతో వీటి నిర్మాణాలు చేపట్టారు. ఈ భవనాల్లో కంప్యూటర్లను ఇతర డిజిటలైజేషన్‌కు సంబంధించిన సామగ్రి కూడా ఏర్పాటు చేశారు. కానీ భవనాలను మాత్రం ఏ ఒక్క రోజు కూడా తెరిచి గ్రామీణ పరిపాలన కొనసాగించలేదు. కార్యాలయ నిర్వహణకు సంబంధించి ఆపరేటర్లను ఎంపిక చేయకపోవడం ప్రధాన కారణంగా చెప్పవచ్చు. ఆపరేటర్ లేకపోవడం వల్ల ఈ-పంచాయతీ కార్యాలయ భవనాలు తెరుచుకోని పరిస్థితి నెలకొంది.

కార్యాలయాల పనితీరు ఇలా..

ఈ- పంచాయతీ కార్యాలయాల పనితీరు పూర్తిగా డిజిటలైజేషన్‌తో కూడుకొని ఉంటుంది. ఈ కార్యాలయానికి ఒక ఆపరేటర్ ఉంటారు. గ్రామపంచాయతీలోని ప్రజల యొక్క అవసరాలను మొత్తం కంప్యూటర్లలో కేంద్రీకరించి పరిపాలన కొనసాగిస్తారు. గ్రామాల్లో నూతన గృహాలకు సంబంధించిన అనుమతి ధ్రువీకరణ పత్రాలు, ఇంటి పన్ను, నీటి పన్ను, గ్రామపంచాయతీల ఆర్థికపరమైన అన్ని అంశాలను ఈ-కంప్యూటర్ల ద్వారా డిజిటలైజేషన్ చేస్తారు. కానీ ఈ-పంచాయతీ కార్యాలయ భవనాలకు ఆపరేటర్లు లేకపోవడంతో మండలంలో ఉన్న రెండు ఈ-పంచాయతీ కార్యాలయ భవనాలు మూతపడి ఉన్నాయి. ప్రభుత్వం ఈ-పంచాయతీ కార్యాలయ భవనాల పనితీరు, అవసరాన్ని గుర్తించి వాటిని వినియోగంలోకి తీసుకురావాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిస్తాం

ఈ- పంచాయతీ కార్యాలయ భవనంలో ఆపరేటర్లను ప్రభుత్వం ఏర్పాటు చేయకపోవడంతో కార్యాలయాలు వినియోగంలో లేవు. గ్రామపంచాయతీలకు సంబంధించిన డిజిటలైజేషన్ మొత్తం కూడా ఎంపీడీఓ కార్యాలయం ద్వారానే నిర్వహిస్తున్నాం. ఆపరేటర్ల నియామకం గురించి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిస్తాం.

– బాలరాజురెడ్డి, ఎంపీడీఓ, కొండమల్లేపల్లి

మృగశిర సందడి

మిర్యాలగూడ టౌన్, నిడమనూరు, హాలియా : మృగశిర కార్తె సందర్భంగా ఆదివారం మిర్యాలగూడ పట్టణంలోని రైతు బజారు వద్ద చేపల మార్కెట్‌లో, నిడమనూరు, హాలియాలో సందడి నెలకొంది. విక్రయదారులు చేపల ధరలు కూడా పెంచారు. మృగశిర కార్తెకు చేపలు తినాలనే సంప్రదాయం ఉండడంతో వాటిని కొనేందుకు చేపల మార్కెట్ వద్ద జనం బారులుదీరారు.



మిర్యాలగూడ పట్టణంలోని క్యాంపునకు వెళ్లే రోడ్డులో చేపలు కొనుగోలు చేస్తున్న ప్రజలు



నిడమనూరులో చేపల విక్రయాలు



మిర్యాలగూడ పట్టణంలోని చేపల మార్కెట్‌లో కొనుగోలుదారుల రద్దీ

బీజేపీని మరింత బలోపేతం చేద్దాం



మాట్లాడుతున్న శివర్ల రమేష్‌యాదవ్

కొండమల్లేపల్లి : కొండమల్లేపల్లి మండలంలో బీజేపీని మరింత బలోపేతం చేసేందుకు పార్టీ శ్రేణులు కలిసికట్టుగా పని చేయాలని ఆపార్టీ జిల్లా కౌన్సిల్ సభ్యుడు శివర్ల రమేష్‌యాదవ్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో నిర్వహించిన బీజేపీ ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం 11 సంవత్సరాల కాలంలో అమలు చేసిన సంక్షేమ పథకాలు, దేశ సంరక్షణకు తీసుకుంటున్న చర్యలపై గ్రామ, బూత్ స్థాయిలో క్షేత్రస్థాయిలో ప్రజలకు వివరించాలన్నారు. ప్రధాని మోదీ దేశాన్ని అన్ని రంగాల్లో బలోపేతం చేస్తున్న తీరును పార్టీ శ్రేణులు ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు భూతరాజు భరత్‌కుమార్, జంగిటి మల్లేష్‌యాదవ్, నెల్లికంటి గోపి, అందుగుల సీతయ్య, కొర్ర చందునాయక్, తరుణ్, వెంకటేష్, మల్లేష్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

దేవతా విగ్రహాల ప్రతిష్ఠ

నిడమనూరు : మండలంలోని రాజన్నగూడెం గ్రామంలో ఆదివారం బొడ్రాయి, మహంకాళీ, కోటమైసమ్మ, ఈదమ్మ దేవత విగ్రహాల ప్రతిష్ఠ నిర్వహించారు. రామాలయంలో సుదర్శనచక్ర ప్రతిష్ఠ, నవగ్రహ మండపం, దేవి విగ్రహాలను ప్రతిష్ఠించారు. కార్యక్రమంలో శివమారయ్య, బీజేపీ నాయకులు వినీల్ రెడ్డి, పాండురంగారావు, మాజీ ఎంపీపీ పద్మ, మార్కెట్ మాజీ చైర్మన్ మందలి లింగయ్య పాల్గొన్నారు.



ప్రతిష్ఠించిన దేవతా విగ్రహాలు



దేవతల రూపంలో కళాకారుల ప్రదర్శన

ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత



పోచంపల్లిలో ఆరోగ్య ఉపకేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి

- ఎమ్మెల్యే కుందూరు జైవీర్ రెడ్డి

గుర్రంపోడు : ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత కలుగుతుందని నాగార్జునసాగర్ ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఎమ్మెల్సీ కేతావత్ శంకర్ నాయక్‌తో కలిసి తేనెపల్లి గ్రామంలో దర్గాదేవి కల్యాణమహోత్సవం, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన, గ్రామ సచివాలయం, సీసీ రోడ్డు ప్రారంభోత్సవ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. పోచంపల్లి, నడికూడ గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పేదల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తుందని తెలిపారు. పోచంపల్లి నుంచి వట్టికోడు వరకు తారు రోడ్డు నిర్మాణానికి కాంట్రాక్టర్‌తో మాట్లాడి త్వరలో పనులు ప్రారంభించేలా చూస్తామన్నారు. పోచంపల్లి నుంచి కస్తాల వరకు రోడ్డు, శశిలేటి వాగుపై చెక్‌డ్యాం నిర్మాణానికి ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు జిల్లా కంచర్ల వెంకటేశ్వర్ రెడ్డి, మాజీ ఎంపీపీ చనమల్ల మాధవీ జగదీశ్వర్ రెడ్డి, మాజీ జెడ్పీటీసీ గాలి రవికుమార్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తగుళ్ల సర్వయ్య, ప్రధాన కార్యదర్శి సూదిని జగదీశ్వర్ రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ యాధవ రెడ్డి, మాజీ సర్పంచ్‌లు రజితా ప్రతాప్ రెడ్డి, గుత్తా తిరుమల్ రెడ్డి, నిమ్మల అంజిరెడ్డి, ఎండీ సత్తార్, నాయకులు కుప్ప అమరేందర్, సోమ రాములు, మేడి వెంకన్న, శివార్ల శేఖర్, కిరణ్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలి

తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని నాగార్జునసాగర్ ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి అన్నారు. ఆదివారం గుర్రంపోడు మండలం పోచంపల్లి గ్రామంలో అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలకు విచ్చేసిన సందర్భంగా బడిబాట కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎం వెంకటయ్య, ప్రాథమిక పాఠశాల హెచ్ఎం కందిమళ్ల కృష్ణారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల బడిబాట



అవగాహన కల్పిస్తున్న ఎంఈఓ, ఉపాధ్యాయులు

కొండమల్లేపల్లి : మండలంలోని గుడితండా, ఇస్లావత్‌తండాలో ఆదివారం ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కరపత్రాలు పంపిణీ చేసి ప్రభుత్వ పాఠశాలలపై అవగాహన కల్పించారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని కోరారు. కార్యక్రమంలో ఎంఈఓ నాగేశ్వర్‌రావు, ఉపాధ్యాయులు కట్టెబోయిన శ్రీనివాసులు, జాన్ నాయక్, సైదులు, గణేష్, గీతాంజలి పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలి



చందంపేటలో అవగాహన కల్పిస్తున్న ఎంఈఓ

చందంపేట : చందంపేట మండల కేంద్రంలో ఆదివారం ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ చందర్‌నాయక్ మాట్లాడుతూ.. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రభుత్వం కల్పిస్తున్న వసతులు, మౌలిక సదుపాయాలను వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు చందర్, శేఖర్, కొండయ్య, చౌదరి పాల్గొన్నారు.

అన్ని హంగులతో కేజీబీవీ

- తిరుమలగిరిలో పూర్తయిన కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయ భవన నిర్మాణం
- నేడు ప్రారంభించనున్న ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి



ప్రారంభానికి సిద్ధంగా ఉన్న పాఠశాల భవనం

తిరుమలగిరి(నాగార్జునసాగర్): ఎనిమిది సంవత్సరాలుగా సరైన సదుపాయాలు లేక కాలం వెల్లదీస్తున్న విద్యార్థులకు ఈ విద్యా సంవత్సరం నుంచి కష్టాలు తీరనున్నాయి. తిరుమలగిరి మండల కేంద్రంలో రూ.3.35 కోట్లతో అన్ని హంగులు, సౌకర్యాలతో కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయ భవన నిర్మాణం పూర్తి చేశారు. ఈ భవనాన్ని సోమవారం నాగార్జునసాగర్ ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి ప్రారంభించనున్నారు.

ఇరుకు గదులతో ఇక్కట్లు పడిన విద్యార్థులు

మండల కేంద్రంలో 2017–18లో అద్దె భవనంలో ప్రారంభమైన కేజీబీవీ పాఠశాలకు సొంత భవనం లేక ఇరుకు గదుల్లో కొనసాగుతూ వచ్చింది. విద్యార్థులు చదువులో మాత్రం ఏనాడు వెనుకబడలేదు. ప్రతి విద్యాసంవత్సరం ఎస్ఎస్‌సీ పరీక్షల్లో అత్యుత్తమ ఫలితాలతో రాణిస్తున్నారు. ప్రస్తుతం పాఠశాలలో 240కు పైగా విద్యార్థినులు విద్యనభ్యసిస్తున్నారు. 20 మంది వరకు టీచింగ్, నాన్‌టీచింగ్ సిబ్బంది ఉన్నారు. అద్దె భవనంలో నిర్వహిస్తున్న పాఠశాలలో సరైన ఫర్నిచర్ లేక పోవడంతో విద్యార్థులు చదువులు ఇక్కట్ల మధ్య కొనసాగించారు. ప్రత్యేకంగా భోజనాలు చేసేందుకు డార్మెంటరీ గది లేకపోవడంతో చెట్ల కిందనే భోజనాలు చేసేవారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా మరుగుదొడ్లు లేక ఇక్కట్లకు గురయ్యేవారు. సరైన ఆటస్థలం లేకపోవడంతో ఆటల్లో నైపుణ్యం కొరవడే పరిస్థితి ఉండేది. దీంతో గత ప్రభుత్వం మండల కేంద్రంలోని రైతు వేదిక పక్కన ఉన్న స్థలాన్ని కేటాయించారు. విద్యా సంక్షేమ మౌలిక వసతుల అభివృద్ధి కార్పొరేషన్ ఆధ్వర్యంలో రూ. 3.35 కోట్లతో 2020లో పాఠశాల భవన నిర్మాణానికి భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. అయితే పనులు ప్రారంభించినప్పటికీ అనుకున్నంత వేగంగా జరగలేదు. ఆరు నెలల క్రితం జిల్లా అధికారులతో పాటు, ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడంతో భవన నిర్మాణ పనులు చకచక కొనసాగాయి.

ఇబ్బందులు తొలగనున్నాయి



ఎనిమిది సంవత్సరాలుగా అద్దె భవనంలోని ఇరుకు గదుల్లో విద్యార్థులతో పాటు, ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వర్షాకాలంలో పాఠశాల పరిస్థితి మరీ దారుణంగా ఉండేది. ప్రభుత్వం స్థలాన్ని కేటాయించి, నూతన సొంత భవనాన్ని ఏర్పాటు చేయడంతో ఇక నుంచి విద్యార్థులు, ఉపాధ్యాయుల ఇబ్బందులు తొలగనున్నాయి. విద్యార్థులు కూడా ఏకాగ్రతతో చదవడానికి అవకాశం ఉంటుంది.

– కవిత, ఎస్ఓ, కేజీబీవీ, తిరుమలగిరి

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

రామగిరి(నల్లగొండ): నల్లగొండ మండలంలోని పెద్ద సూరారం గ్రామంలో వివిధ అభివృద్ధి పనులకు కాంగ్రెస్ నాయకులు ఆదివారం శంకుస్థాపన చేశారు. రూ.7లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్లు, మురుగు కాలువలు, రూ.10 లక్షల వ్యయంతో వ్యవసాయ పొలాలకు వెళ్లే రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నల్లగొండ పట్టణ అధ్యక్షుడు గుమ్ముల మోహన్‌రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ వంగూరి లక్ష్మయ్య, మాజీ ఎంపీటీసీ పెండెం రత్నమాల పాండు, కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు పిల్లి యాదగిరి యాదవ్, ఏడుదొడ్ల వెంకట్రాంరెడ్డి, యూత్ కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు తంతెనపల్లి రామలింగం, ఏడుదొడ్ల కొండల్‌రెడ్డి, ఏడుదొడ్ల కృష్ణారెడ్డి, గుండె వెంకన్న, ముసుకు భిక్షం, కోట్ల జలంధర్ రెడ్డి, ఎర్రమాద మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డిస్ట్రిక్ట్ కెమిస్ట్ డ్రగ్గిస్ట్ నూతన కార్యవర్గం ఎన్నిక

నల్లగొండ టౌన్: నల్లగొండ పట్టణంలోని పద్మశాలి భవనంలో ఆదివారం మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ది నల్లగొండ డిస్ట్రిక్ట్ కెమిస్ట్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ ఎన్నికలు నిర్వహించారు. అసోసియేషన్ అధ్యక్షుడిగా చిలుకూరి పరమాత్మ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా కొంపెల్లి గోవర్ధన్, కోశాధికారిగా చిలుకూరి వెంకటేశ్వర్లు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో సిరిప్రోలు వెంకటపతి, పోశం రఘుపతి, పోశం లక్ష్మీనారాయణ, వల్లందాసు శ్రీనివాసులు, కృష్ణకుమార్ పాల్గొన్నారు.



నూతన కార్యవర్గం

పెద్దవూరలో నేడు పీహెచ్‌సీ భవనం ప్రారంభం



పెద్దవూర పీహెచ్‌సీ నూతన భవనం

పెద్దవూర: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం పక్కన నూతనంగా నిర్మించిన ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం(పీహెచ్‌సీ) భవనం ప్రారంభానికి సిద్ధమైంది. ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి సోమవారం ప్రారంభించనున్నట్లు మండల విద్యాధికారి డాక్టర్ నగేష్ ఆదివారం తెలిపారు. మండల కేంద్రంలో దశాబ్దాల క్రితం నిర్మించిన పీహెచ్‌సీ భవనం శిథిలావస్థకు చేరడంతో నూతన భవన నిర్మాణానికి రెండున్నరేళ్ల క్రితం ప్రభుత్వం రూ.1.56 కోట్ల 15వ ఆర్థిక సంఘం నిధులు మంజూరు చేసింది. ఈమేరకు విశాలమైన ఓపీ హాలు, డాక్టర్లకు ప్రత్యేకమైన గదులు, స్టోర్ రూం, ప్రసవాలు, కుటుంబ నియంత్రణ చికిత్సలకు వీలుగా మినీ ఆపరేషన్ థియేటర్, ల్యాబ్ గదులతో పీహెచ్‌సీ భవనం నిర్మించారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



పెద్దవూరలో పాఠాలు బోధించిన ఉపాధ్యాయులను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

మిర్యాలగూడ టౌన్ : మిర్యాలగూడ పట్టణంలోని ప్రైవేట్ స్కూల్‌లో 1997–98బ్యాచ్‌కు చెందిన పదో తరగతి పూర్వ విద్యార్థులు స్థానిక హోటల్‌లో ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా అప్పటి ఉపాధ్యాయులు అప్పాల పాండురంగారావు, విజయ్‌భాస్కర్, రాజు, అక్కి మోహన్‌లను సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు బాణాల ప్రవీణ్, కొరివి కృష్ణ, కాకాని ప్రవీణ్, సజ్జల ప్రవీణ్, కందేపు, గీత, అనంతలక్ష్మి తదితరులున్నారు.

పెద్దవూర: మండల కేంద్రంలోని నాగార్జున ఉన్నత పాఠశాలలో 2010–11 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. 15ఏళ్ల తర్వాత ఒకే వేదికపై కలుసుకోవడంతో వారి ఆనందాలకు అవధులు లేకుండా పోయాయి. కార్యక్రమంలో అప్పటి హెచ్ఎం కూస్‌రెడ్డి రాంరెడ్డి, ఉపాధ్యాయులు గుంటుక రామాంజిరెడ్డి, ఇరుమాది శ్రీనివాస్‌రెడ్డి, మూల శేఖర్‌రెడ్డి, గంధం వినోద్‌కుమార్, శ్రీనివాస్, కాటేపల్లి రమేష్, ముత్యాలు, యాదగిరి, రాములు, నాటి పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

త్రిపురారం : మండలంలోని నీలాయిగూడెం గ్రామంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1997–1998 బ్యాచ్‌కు చెందిన 10వ తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం పాఠశాలలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. అప్పటి ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ ఉపాధ్యాయులు నారాయణ, రవి, సుబ్రమణ్యం, కలిమెల నాగయ్య, సాగర్ రావు, జానిమియా, సూర్య నారాయణ రెడ్డి, పూర్వ విద్యార్థులు రామలింగమ్మ, హెమలత, సైదమ్మ పాల్గొన్నారు.



త్రిపురారం : నీలాయిగూడెంలో ఆత్మీయ సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు



మిర్యాలగూడ టౌన్ : ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

అస్తవ్యస్తంగా పల్లె ప్రకృతి వనం



పల్లె ప్రకృతి వనం ఎదుట పెరిగిన కంపచెట్లు

కొండమల్లేపల్లి: మండలంలోని వర్ధమానిగూడెంలో ఏర్పాటు చేసిన పల్లె ప్రకృతి వనం అస్తవ్యస్తంగా మారింది. ప్రవేశ ద్వారం వద్ద కంపచెట్లు పెరిగాయి. బోర్డు నేలకూలింది. గ్రామపంచాయతీల్లో ఇదే పరిస్థితి నెలకొంది. ఉన్నతాధికారులు స్పందించి పల్లె ప్రకృతి వనాలపై దృష్టి సారించడంతో పాటు గ్రామంలో సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.